క్లుప్తంగా

నేడు విద్యుత్ అంతరాయం

రామగుండం: రామగుండం, అంతర్గాం మండలాల పరిధిలోని ఆకెనపల్లిలోని ప్రధాన సబ్ స్టేషన్‌లో పునరుద్ధరణ పనుల దృష్ట్యా శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని టీజీఎన్పీడీసీఎల్ ఏఈలు ఆశ శంకర్, తొటం రవీందర్ తెలిపారు.

కమాన్‌పూర్: కమాన్‌పూర్, రొంపికుంట విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో శనివారం ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయముంటుందని ఏఈ అశోక్‌కుమార్ తెలిపారు.

గోదావరిఖని టు అరుణాచలం బస్సు

గోదావరిఖని టౌన్: భక్తుల కోసం కరీంనగర్ రీజియన్‌లోని గోదావరిఖని డిపో నుంచి తమిళనాడులోని అరుణాచల పుణ్యక్షేత్రానికి ఫిబ్రవరి 19 బుధవారం ప్రత్యేక బస్సును ఏర్పాటు చేసినట్లు గోదావరిఖని డిపో మేనేజర్ ఎం.నాగభూషణం ఒక ప్రకటనలో తెలిపారు. 19న మధ్యాహ్నం 3 గంటలకు గోదావరిఖనిలో బయలుదేరి సాయంత్రం 04.30 గంటలకు కరీంనగర్ మీదుగా వెళ్తుందన్నారు. శ్రీకానిపాక వరసిద్ధి వినాయక దేవస్థానం, శ్రీమహాలక్ష్మి గోల్డెన్ టెంపుల్ దర్శనం చేసుకునే అవకాశముంటుందన్నారు. 20న అరుణాచలం చేరుకుంటుందని తెలిపారు. అరుణాచల గిరి ప్రదక్షిణ, దర్శనం అనంతరం 21న మధ్యాహ్నం 3 గంటలకు బయలుదేరి తిరుగు ప్రయాణంలో శ్రీజోగులాంబ దేవస్థానం అలంపూర్ మీదుగా 22న సాయంత్రం 6 గంటలకు కరీంనగర్–గోదావరిఖని చేరుకుంటుందన్నారు. ముందస్తు రిజర్వేషన్ కోసం మా వెబ్‌సైట్‌లో సర్వీస్ నంబర్ 69999ను ఎంపిక చేసుకోవాలని అన్నారు. వివరాలకు 7013504982, 7989847927 నంబర్లను సంప్రదించాలని కోరారు. చార్జీలు గోదావరిఖని నుంచి పెద్దలకు రూ.4,850, పిల్లలకు రూ.4,100, కరీంనగర్ నుంచి పెద్దలకు రూ.4,500, పిల్లలకు 3,800 తీసుకుంటున్నారు.

తహసీల్దార్‌కు సన్మానం



తహసీల్దార్ రాంచందర్‌రావును సన్మానిస్తున్న బాలాజీరావు తదితరులు

సుల్తానాబాద్: సుల్తానాబాద్ తహసీల్దార్ రాంచందర్‌రావును తాజా మాజీ ఎంపీపీ బాలాజీరావు శుక్రవారం సన్మానించారు. బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా కార్యాలయంలో కలిసి స్వాగతం తెలిపారు. గ్రామాల్లో రైతుల భూసమస్యలు అధికంగా ఉన్నాయని, వాటిని పరిష్కరించేందుకు ప్రత్యేక చొరవ తీసుకోవాలని విన్నవించారు. శంకర్, రాజమల్లయ్య, రమేశ్, వీరస్వామి తదితరులున్నారు.

ధర్మారం తహసీల్దార్‌గా ఎండీ వకీల్



తహసీల్దార్‌కు పూల మొక్కతో స్వాగతం పలుకుతున్న సిబ్బంది

ధర్మారం: మండల తహసీల్దార్‌గా ఎండీ వకీల్ శుక్రవారం కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. కాల్వశ్రీరాంపూర్ తహసీల్దార్‌గా పని చేసిన వకీల్ ధర్మారంకు బదిలీ కాగా.. ఇక్కడ పని చేసిన ఎండీ ఆరీఫొద్దీన్ కలెక్టర్ కార్యాలయానికి బదిలీపై వెళ్లారు. కార్యాలయ సిబ్బంది మొక్క అందించి స్వాగతం పలికారు.

మాజీ కార్పొరేటర్‌కు సన్మానం



రామగుండం: కార్పొరేషన్ 22వ డివిజన్ కార్పొరేటర్‌గా కొనసాగిన కౌశిక లత పదవీకాలం ఇటీవల ముగియడంతో శుక్రవారం ఎస్సీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి జిల్లా నాయకుడు గంగాప్రసాద్ శాలువ, పూలమాలతో ఘనంగా సత్కరించారు. డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో నిత్యం క్షేత్ర పర్యటన చేపడుతూ స్థానిక సమస్యలను తెలుసుకొని పరిష్కరించారని కొనియాడారు. రాబోయే రోజుల్లో మరిన్ని ఉన్నతమైన పదవులు చేపట్టాలని ఆకాంక్షిస్తున్నట్లు పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

ధర్మారం: గొల్లపల్లి మండలం లోత్తునూరు గ్రామానికి చెందిన లక్కం లక్ష్మి(36) అనే వివాహిత ధర్మారం మండలం మల్లాపూర్ గ్రామంలో ఈనెల 5న పురుగుల మందు తాగగా.. చికిత్స పొందుతూ శుక్రవారం మరణించినట్లు ధర్మారం ఎస్సై శీలం లక్ష్మణ్ తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. లక్ష్మి అదే గ్రామానికి చెందిన లక్కం హరీశ్ వద్ద అప్పు తీసుకుంది. తీసుకున్న డబ్బులు చెల్లించాలని హరీశ్ వేధించగా.. మల్లాపూర్ గ్రామంలోని తల్లిగారింటికి వచ్చి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే కరీంనగర్‌లోని ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం మరణించినట్లు మృతురాలి తల్లి యశోద లలిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతురాలికి ఇద్దరు పిల్లలున్నారు.

నీడ సౌకర్యం కరువు

- బస్ షెల్టర్లు లేక ఇబ్బంది పడుతున్న ప్రయాణికులు



పాత్కపల్లిలో బస్సు కోసం ఎండలో నిరీక్షిస్తున్న ప్రయాణికులు

ఓదెల: ఆర్టీసీ శాఖ ప్రయాణికుల కోసం తగినన్ని బస్సులు నడిపిస్తోంది గానీ ప్రయాణికులు వేచి ఉండడానికి నీడ సౌకర్యం కల్పించడం లేదు. కూడళ్ల వద్ద కనీసం నీడ సౌకర్యం, బస్ షెల్టర్లు లేక ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. కొలనూర్, పొత్కపల్లి, కొమిర, గుంపుల, ఓదెల గ్రామాల్లో చాలినన్ని బస్ షెల్టర్లు లేవు. కొలనూర్ రైల్వే స్టేషన్‌లో దిగిన చుట్టుపక్కల గ్రామాల ప్రయాణికులు స్వస్థలాలకు వెళ్లేందుకు బస్సులు, ప్రయివేట్ వాహనాల్లో వెళ్తుంటారు. అయితే బస్టాండ్ లేకపోవడంతో గంటల తరబడి ఎండలో వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఓదెల మండలంలోని పలు ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేసే ఉద్యోగులు, పనినిమిత్త మండల ఆఫీసులకు వచ్చే గ్రామాల ప్రజలు బస్టాండు లేక రోడ్డుపైనే నిలబడాల్సిన దుస్థితి నెలకొంది. ప్రస్తుతం ఎండలు ముదురుతున్నందున కనీసం నీడ సౌకర్యం కల్పించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

బస్టాండ్లు నిర్మించాలి



మండలంలో ప్రయాణికుల సౌకర్యార్థం బస్టాండ్లు నిర్మించాలి. గుంపుల నుంచి బస్సుల ద్వారా జమ్మికుంట, హుజూరాబాద్, పెద్దపల్లికి నిత్యం వందల సంఖ్యలో ప్రయాణం చేస్తుంటారు. వెంటనే ఆర్టీసీ శాఖ ఆధ్వర్యంలో బస్టాండ్లు నిర్మించాలి.

– కాంతాల సమ్మిరెడ్డి, గుంపుల

ఎండలోనే వేచి చూస్తున్నాం



సుల్తానాబాద్, కాల్వశ్రీరాంపూర్ మండలాల ప్రజలు కొలనూర్ రైల్వే స్టేషన్‌లో దిగి వారి స్వస్థలాలకు వెళ్తారు. అయితే స్టేషన్ నుంచి దిగిన ప్రయాణికులు బస్సులు, ఆటోల కోసం ఎండలోనే వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. వెంటనే బస్ షెల్టర్లు నిర్మించాలి.

– జీడుల దివాకర్, కొలనూర్

తిప్పలు పడుతూ..



ప్రయాణికుల సౌకర్యార్థం అధికారులు బస్ షెల్టర్లు నిర్మించాలి. ప్రస్తుతం ఎండలోనే గంటల తరబడి బస్సులు వచ్చేదాకా నిరీక్షించాల్సి వస్తోంది. విద్యార్థులు, వృద్ధులు, మహిళలు ఇబ్బందులు పడుతున్నారు.

– మాటూరి వెంకటస్వామి, మాజీ సర్పంచ్, కొలనూర్

వరిలో లోపాలను గుర్తించిన ఏవో



వరి సాగు పరిశీలిస్తున్న ఏవో సతీశ్

రామగుండం: యాసంగి వరి సాగు దశలో పైరుకు పలు కీటక నాశులతో రైతులు నష్టపోయే అవకాశముందని అంతర్గాం మండల వ్యవసాయాధికారి సతీశ్ అన్నారు. శుక్రవారం మండలంలోని పలు గ్రామాల్లో క్షేత్ర పరిశీలన చేసి వరి పైరులో వరి కాండం తొలిచే పురుగు, అగ్గి తెగులు సోకినట్లు పలు లోపాలను గుర్తించి చేపట్టాల్సిన నివారణ చర్యలను తెలియజేశారు. ఎక్కువగా యాసంగి పంటకు సోకుతాయని స్పష్టం చేశారు.

కాండం తొలిచే పురుగు నివారణకు పిలుకలు, జబ్బు చేసే దశల్లో కార్బోఫ్యూరస్ మూడు గ్రాముల గుళికలు పది కిలోలు లేదా ఎసిఫెట్ 1.5 గ్రాములు, కార్బాప్ హైడ్రోక్లోరైడ్ 50 ఎస్పీ 2 గ్రాములు లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలి. అంకురం నుంచి చేరు పొట్టి దశలో కార్బాప్ హైడ్రోక్లోరైడ్ నాలుగు గ్రాముల గుళికలు రెండు కిలోలు లేదా క్లోరన్ట్రానిట్రిప్రోల్ 0.4 గ్రాములు నాలుగు కిలోలు లేదా క్లోరాన్ట్రనిక్‌ప్రోల్ 20 ఎస్పీ 0.4 మి.లీ. చొప్పున నీటిని కలిపి పిచికారీ చేయాలి. అగ్గి తెగులు నివారణకు తెగల లక్షణాలు గమనించి వెంటనే ట్రైసైక్లోజల్ 0.6 గ్రాములు లేదా ఐసోప్రోథయోలిన్/కాస్గామైసిన్ 2.5 మి.లీ. నీటిని కలిపి పిచికారీ చేయాలి.

తాగునీటికి ఇబ్బందులు రానివ్వం



అధికారులతో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ నియాజ్

సుల్తానాబాద్: మున్సిపల్‌వ్యాప్తంగా ప్రజలకు వేసవి కాలంలో తాగునీరుకు ఇబ్బందులు రానివ్వకుండా ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ నియాజ్ తెలిపారు. శుక్రవారం పట్టణంలోని ఐహెచ్‌ఎస్ఆర్, పైపులైన్లు, వాటర్ ట్యాంకులను కలెక్టర్ ఆదేశం మేరకు పరిశీలిస్తున్నట్లు చెప్పారు. మిషన్ భగీరథ వాటర్ సప్లయ్ సమస్యల్లో భాగంగా మిషన్ భగీరథ, ఓవర్ హెడ్ ట్యాంక్ 200 కేఎల్ మంచినీటి సరఫరా పైపులైన్ ట్రెయిల్ రన్, లీకేజీ మున్సిపల్ ఏఈ సతీశ్‌తో కలిసి పరిశీలించారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం అన్ని శాఖల ఉద్యోగులు సిబ్బందితో సమావేశం నిర్వహించారు. శాఖల పరిధిలో సమస్యలను తన దృష్టికి తీసుకురావాలని, ఫిర్యాదులు వస్తే చర్యలు తీసుకుంటానని సిబ్బందిని హెచ్చరించారు. మున్సిపల్ జూనియర్ అసిస్టెంట్ రాజు, వినాయక్, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

ఎలిగేడు: వేసవిలో ప్రజలకు తాగునీటి కష్టాలు రాకుండా చర్యలు చేపడుతున్నామని ఎంపీడీవో భాస్కర్‌రావు, ఎంపీవో అరిఫ్ అన్నారు. శుక్రవారం తాగునీటి సమస్యలపై బుర్హాన్‌మియాపేటలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. గ్రామంలో రక్షిత మంచినీటి బావి, వాటర్ ట్యాంకులు, బోరుబావులను పరిశీలించారు. మిషన్ భగీరథ గ్రిడ్ ఏఈ సూర్యతేజ, పంచాయతీ కార్యదర్శి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కాల్వశ్రీరాంపూర్: పెగడపల్లి గ్రామంలో తాగునీటి పథకాలను ఎంపీడీవో శుక్రవారం పరిశీలించారు. రానున్న వేసవికాలం దృష్ట్యా గ్రామాల్లో తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఎంపీవో కిరణ్, ఆర్‌డబ్ల్యూస్ ఏఈ కోరోనెల్, మిషన్ భగీరథ గ్రిడ్ ఏఈ కళ్యాణ్, పంచాయతీ కార్యదర్శి శంకర్, సిబ్బంది పాల్గొన్నారు.

మాదిగల డప్పు చప్పుళ్ల ర్యాలీ



డప్పు కొడుతున్న మార్కెట్ చైర్‌పర్సన్ స్వరూప తదితరులు

పెద్దపల్లిరూరల్: ఎస్సీ వర్గీకరణ అమలుకు రాష్ట్ర ప్రభుత్వం ఏకసభ్య కమిషన్‌ను నియమించి ప్రత్యేకంగా నిర్వహించిన అసెంబ్లీ సమావేశాల్లో ఆమోదం పొందిన సందర్భంగా ఎంఆర్‌పీఎస్ నేతలు శుక్రవారం పెద్దపల్లిలో డప్పు చప్పుళ్లతో ర్యాలీ నిర్వహించి సంబరాలు జరుపుకున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే విజయరమణారావు చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. పట్టణంలోని జెండా కూడలి నుంచి కమాన్ మీదుగా బస్టాండ్ వరకు మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ ఈర్ల స్వరూప, నాయకులు లంక సదయ్య, చిలుక సతీశ్ తదితరుల ఆధ్వర్యంలో డప్పులను కొడుతూ ర్యాలీ నిర్వహించారు. వర్గీకరణకు సంబంధించిన గెజిట్‌ను వెంటనే ప్రచురించాలని మాదిగ సంఘ నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. నాయకులు కొండయ్య, రామస్వామి, రాజేశం, నర్సయ్య, మల్లేశ్, శంకర్, లచ్చయ్య, రాజు, ముఖేశ్, బాలయ్య పాల్గొన్నారు.

చట్టబద్ధత కల్పించడంపై సంబరాలు

ఎలిగేడు: ఎస్సీ వర్గీకరణకు అసెంబ్లీలో సీఎం రేవంత్‌రెడ్డి చట్టబద్ధత కల్పించడంపై మండల కేంద్రంలో దళిత సంఘాల ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించారు. ఎలిగేడు బస్టాండ్ ఆవరణలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. లాలపల్లి మాజీ సర్పంచ్ బాసంపల్లి కొండయ్య, కవ్వంపల్లి స్వామి, రాములు, బాసంపల్లి శ్రీనివాస్, న్యాతరి శంకరయ్య పాల్గొన్నారు.

రైతులు గస్తీ చేపట్టాలి



అవగాహన కల్పిస్తున్న టూటౌన్ ఎస్సై సురేశ్

యైటింక్లయిన్‌కాలనీ: విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, మోటార్లు, తీగల దొంగతనాలు జరగకుండా రైతులు గ్రామ శివారులో రాత్రిపూట గస్తీ చేపట్టాలని గోదావరిఖని టూటౌన్ ఎస్సై సురేశ్, విద్యుత్ ఏఈ మహేందర్‌రెడ్డి సూచించారు. రామగిరి మండలం సుందిళ్ల గ్రామ శివారులోని ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, మోటార్లు, తీగల చోరీ జరుగుతున్న నేపథ్యంలో గోదావరిఖని టూటౌన్ సీఐ ప్రసాద్‌రావు ఆదేశాల మేరకు పంచాయతీ ఆవరణలో శుక్రవారం అవగాహన కల్పించారు. విద్యుత్ లైన్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు, లైన్‌మెన్ రాజేందర్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణకు చేయిచేయి కలుపుదాం



సమావేశంలో పాల్గొన్న అధికారులు

కాల్వశ్రీరాంపూర్: నులిపురుగుల నివారణకు చేయి చేయి కలుపుదామని, జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని విజయవంతం చేద్దామని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శ్రీనివాస్, ఎంపీడీవో రామ్మోహనాచారి పిలుపునిచ్చారు. ఈనెల 10న జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం పురస్కరించుకొని వైద్యశాఖ నేతృత్వంలో మండల పరిషత్ సమావేశ మందిరంలో శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ భావన, డాక్టర్ చందన, ఎంపీవో కిరణ్, సూపరింటెండెంట్ శ్రీధర్, సీనియర్ అసిస్టెంట్ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న ప్రభుత్వాలు



మాట్లాడుతున్న చలపతిరావు

గోదావరిఖని: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజావ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నాయని న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు చలపతిరావు పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక యూనియన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన జిల్లా విస్తృత స్థాయి సమావేశంలో మాట్లాడారు. కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం ఆర్‌ఎస్‌ఎస్ ఎజెండాను అమలు చేస్తోందని, ప్రజల మధ్య భావోద్వేగాలను రెచ్చగొడుతోందన్నారు. నాయకులు ఇ.నరేశ్, టి.శ్రీనివాస్, రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఐ.కృష్ణ, ఎం.శ్రీనివాస్, వెంకన్న పాల్గొన్నారు.

సంతాప సభ నిర్వహణ బాధాకరం



మాట్లాడుతున్న తహసీల్దార్ తూమ్ రవీందర్‌పటేల్

రామగుండం: అంతర్గాం ఎంపీడీవోగా బదిలీపై వచ్చి బాధ్యతలు స్వీకరించిన ఏడాది లోగా విధి నిర్వహణలో తీవ్ర మానసిక ఒత్తిడికి గురై గుండెపోటుతో మృతిచెందిన ఎంఏ అలీం పేరిట సంతాప సభ నిర్వహిస్తుండడం బాధాకరంగా ఉందని అంతర్గాం తహసీల్దార్, తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు తూమ్ రవీందర్‌పటేల్ అన్నారు. అంతర్గాం మండల పరిషత్ సమావేశ మందిరంలో శుక్రవారం ఇటీవల మరణించిన ఎంపీడీవో అలీం సంతాప సభలో ఆయన చిత్రపటానికి నివాళి అర్పించారు. రెండు నిమిషాలు మౌనం పాటించి మాట్లాడారు. ఇన్‌చార్జి ఎంపీడీవో బైరి వేణుమాధవ్, సూపరింటెండెంట్ మామిడాల కరుణాకర్, ఏపీవో రమేశ్, ఏపీఎం సంది నర్సమ్మ, మండల వైద్యాధికారి డాక్టర్ ఉదయ్‌కుమార్, వివిధ గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి క్షేత్ర సహాయకులు తదితరులున్నారు.

మ్యాన్‌వే భవనం ప్రారంభమెప్పుడో?



ఓసీపీ–3 బేస్ వర్క్‌షాప్‌లో ఏర్పాటు చేసిన మ్యాన్‌వే భవనం

గోదావరిఖని: మూడు నెలల క్రితం ఓసీపీ–3 బేస్ వర్క్‌షాప్ మ్యాన్‌వే కోసం నిర్మించిన భవనం ఇప్పటికీ ప్రారంభోత్సవానికి నోచుకోవడం లేదు. దీంతో మస్టర్ పడేందుకు బేస్‌వర్క్‌షాప్ కార్మికులు ఇబ్బంది పడుతున్నారు. మస్టర్ కోసం మెయింటినెన్స్ సెక్షన్ లోపలికి వెళ్లి రావడంతో సరైన సేఫ్టీ లేక ప్రమాదాలు జరిగే అవకాశముందని వారంటున్నారు. యాజమాన్యం వెంటనే స్పందించి మ్యాన్‌వే ప్రారంభించాలని ఐఎన్‌టీయూసీ నాయకులు డిమాండ్ చేశారు.

ముగిసిన క్రికెట్ పోటీలు



బహుమతి అందజేస్తున్న ఎస్సై సంధ్యారాణి

రామగుండం: పట్టణ పరిధిలోని రాయదండి శివారు క్రీడామైదానంలో మజాద్ స్మారక క్రికెట్ పోటీలు శుక్రవారంతో ముగిశాయి. రామగుండం నియోజకవర్గ పరిధిలో 33 జట్లు పాల్గొన్నాయి. ఎండీ గౌస్‌బాబా జట్టు విజేతగా నిలవగా, రన్నరప్‌గా పవన్ ఎన్టీపీసీ, మూడో స్థానంలో రామ్‌శక్తి జట్టు, నాల్గో స్థానంలో రైల్వే జట్టు, ఐదో స్థానంలో ఆర్గనైజర్ జట్టు నిలిచాయి. విజేతలకు ఎస్సై గుండేటి సంధ్యారాణి, మార్కెట్ కమిటీ చైర్మన్ గాలిపెల్లి తిరుపతి చేతుల మీదుగా ప్రోత్సాహక బహుమతులు ప్రదానం చేశారు.



ముత్తారం: పోతారం రెండో వార్డులో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా ఉంది. స్తంభానికి కింది భాగంలో ట్రాన్స్‌ఫార్మర్ అమర్చడంతో నడిచి వెళ్లేవారు, పశువులకు ప్రమాదం పొంచి ఉంది. ట్రాన్స్‌కో అధికారులకు పలుమార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ట్రాన్స్‌ఫార్మర్‌ను సరిచేయలని కోరుతున్నారు.

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 97053 46608, 98499 71500

సింగరేణి వార్తలు

సేవ్ సింగరేణి కోసం ఉద్యమిస్తాం

గోదావరిఖని: సింగరేణి సంస్థ పరిరక్షణ కోసం ఉద్యమిస్తామని ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ అన్నారు. శుక్రవారం స్థానిక ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. త్వరలో ఉద్యమాన్ని ప్రారంభించనున్నట్లు చెప్పారు. సింగరేణిలో ఏడోసారి గుర్తింపు సంఘం ఎన్నికలు జరిగి సంవత్సరం గడిచినా.. యాజమాన్యం ఇప్పటివరకు కార్మికుల సమస్యల పరిష్కారం కోసం కాలానుగుణంగా జరిగే స్ట్రక్చర్, జేసీసీ, సీఅండ్ ఎండీ లెవెల్ మీటింగులు నిర్వహించడంలో నిర్లక్ష్యం వహిస్తోందన్నారు. నాయకులు ఎల్.ప్రకాశ్, వైవీరావు, కె.స్వామి, ఆరెల్లి పోషం, కందుకూరి రాజారత్నం, జూపాక రాంచందర్, ఎస్.వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

జనరల్ మజ్దూర్లు ఇక జనరల్ అసిస్టెంట్‌గా..

గోదావరిఖని: సింగరేణిలో పని చేస్తున్న బదిలీ వర్కర్లు, జనరల్ మజ్దూర్ల డిజిగ్నేషన్‌ను జనరల్ అసిస్టెంట్‌గా మారుస్తూ త్వరలో ఉత్తర్వులు రానున్నాయని బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య అన్నారు. శుక్రవారం ఆయన పత్రిక ప్రకటనలో వివరాలు వెల్లడించారు. సింగరేణిలో ఏళ్ల తరబడి బదిలీ వర్కర్లు, జనరల్ మజ్దూర్లు సామాజిక అసమానతలకు గురౌతున్నారన్నారు. ఈక్రమంలో బీఎంఎస్ బొగ్గు పరిశ్రమల ఇన్‌చార్జి కొత్తకాపు లక్ష్మారెడ్డి ఆదేశాల మేరకు ఈనెల 6న రాజస్థాన్ రాష్ట్రంలోని జైసల్మార్‌లో జరిగిన 2వ స్టాండరైజేషన్ కమిటీ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు వివరించారు.

సింగరేణి రిటైర్డ్ ఉద్యోగులను ఆదుకోవాలి

రామగిరి: ఉద్యోగంలో కొనసాగినంత కాలం సంస్థ అభివృద్ధికి పాటుపడిన సింగరేణి విశ్రాంత ఉద్యోగులను ఆదుకోవాలని బీఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి సత్తయ్యకు శుక్రవారం సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు గౌతం శంకరయ్య, సభ్యులు వినతిపత్రం అందజేశారు. సింగరేణి ఉద్యోగులుగా విరమణ పొందిన ఎందరో చాలీచాలని పెన్షన్ పొందుతూ ఆర్థికంగా అవస్థలు పడుతున్నారన్నారు. మల్లయ్య, పట్నం సత్యనారాయణ, తోట మొండయ్య, వంగరాజ సమ్మయ్య, నూనె రాజేశం తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం కోసం సర్వే

కమాన్‌పూర్: పేంచికల్‌పేట గ్రామంలో సింగరేణి సంస్థ ఆర్జీ–2 ఆధ్వర్యంలో సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం కోసం శుక్రవారం సింగరేణి సివిల్ ఇంజనీరింగ్ అధికారులు శ్రీరాములు, నరేశ్ సర్వే నిర్వహించారు. సింగరేణి ప్రభావిత గ్రామంలో అంతర్గత రోడ్లు, డ్రైనేజీల్లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని గ్రామానికి చెందిన పల్లె నారాయణ ఇటీవల సింగరేణి అధికారులకు వినతిపత్రం అందజేశారు.

చందాలు పంచుకొని జైలుకెళ్లిన చరిత్ర టీబీజీకేఎస్‌దే..

గోదావరిఖని: చందాలు పంచుకొని జైలుకెళ్లిన చరిత్ర టీబీజీకేఎస్ నాయకులకే ఉందని ఐఎన్‌టీయూసీ కేంద్ర సీనియర్ ఉపాధ్యక్షుడు నర్సింహారెడ్డి విమర్శించారు. శుక్రవారం స్థానిక ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పదేళ్లు అధికారంలో ఉండి ప్రభుత్వం పోయిన 24 గంటల్లోనే రాజీనామా చేసిన నాయకులకు తమ నేతను విమర్శించే హక్కు లేదన్నారు. మీ యూనియన్ నాయకుల వల్ల కోల్‌బెల్ట్‌లో బీఆర్‌ఎస్ ఒక్క సీటైనా గెలిచిందా చెప్పాలని అన్నారు. నాయకులు సదానందం, లక్ష్మీపతిగౌడ్, శేషరత్నం, గడ్డం కృష్ణ, నవీన్, సాయి, తాటి రాజయ్య, బర్ల మనోహర్, తాటికొండ అంజయ్య, పూజల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

పేదింటి యువతి వివాహానికి చేయూత



జూలపల్లి: మండల కేంద్రానికి చెందిన నిరుపేద యువతి ఉప్పుల కొమురయ్య కూతురు సాహిత్య వివాహానికి మాజీ ప్రజాప్రతినిధులు ఆర్థిక సాయమందించారు. జూలపల్లి తాజా మాజీ జెడ్పీటీసీ సభ్యుడు బొద్దుల లక్ష్మణ్ రూ.5వేలు, మాజీ సర్పంచ్ ధారబోయిన నర్సింహయాదవ్ రూ.5వేల నగదును అందజేశారు.

విద్యార్థులకు గుర్తింపు కార్డులు పంపిణీ



ఓదెల: హరిపురం గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు లయన్స్ క్లబ్, అక్షర, నారాయణ ఫౌండేషన్ ప్రతినిధులు శ్రీనివాస్, ప్రదీప్, భూమేశ్ శుక్రవారం గుర్తింపు కార్డులను పంపిణీ చేశారు. ప్రధానోపాధ్యాయుడు మహేందర్‌రెడ్డి, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ పద్మ, ఉపాధ్యాయులు సూత్రాల శ్రీనివాస్, పావని, హేమలత, హైమవతి, తోట రాజు పాల్గొన్నారు.

పశు పోషణతో లాభం

ఓదెల: పశు పోషణతో రైతులకు అధిక లాభం వస్తుందని ఓదెల పశు వైద్యాధికారి మల్లేశం పేర్కొన్నారు. శుక్రవారం పిట్టలఎల్లయ్యపల్లెలో పశు వైద్య శిబిరం నిర్వహించారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా పశు గణాభివృద్ధి సంస్థ సూపర్‌వైజర్ రాఘవ ఆధ్వర్యంలో కృత్రిమ గర్భధారణ పద్ధతిలో జన్మించిన ఆడదూడల ప్రదర్శన చేశారు.

బీజేపీ జిల్లా అధ్యక్షుడిని కలిసిన నాయకులు

ఓదెల: బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా ఇటీవల ఎన్నికైన కర్రె సంజీవరెడ్డి, పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే గుజ్జుల రామకృష్ణారెడ్డిలను కొలనూర్ గ్రామ నాయకులు శుక్రవారం ఘనంగా సన్మానించారు.

రోడ్డు పనులు ప్రారంభం



మట్టి తీస్తున్న జేసీబీ

సుల్తానాబాద్: పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయం మలుపు నుంచి అభివృద్ధి పనులు ప్రారంభమయ్యాయి. శుక్రవారం జేసీబీతో రోడ్డులో ఉన్న మట్టిని లారీల ద్వారా బయటకు తరలిస్తున్నారు. కాల్వశ్రీరాంపూర్ చౌరస్తా నుంచి గట్టెపల్లి రోడ్డు శాంతినగర్ వరకు రోడ్డు మంజూరు చేసి పనులను 15 రోజుల క్రితమే ఎమ్మెల్యే విజయరమణారావు ప్రారంభించారు. పనులు వేగవంతంగా చేసి ఇబ్బందులు కలగకుండా, దుమ్ము లేవకుండా నిత్యం వాటర్ క్యూరింగ్ చేయాలని వ్యాపారులు అధికారులను కోరుతున్నారు.

న్యాయవాదిపై దాడి సరికాదు

మంథని: హన్మకొండ జిల్లాలో సీనియర్ న్యాయవాది గంధం శివపై అక్కడి ట్రాఫిక్ సీఐ సీతారెడ్డితోపాటు మరికొంతమంది పోలీసులు దాడి చేయడం సరికాదని న్యాయవాది ఇనుముల సతీశ్ అన్నారు. విధి నిర్వహణలో కొన్నిచోట్ల కొంత మంది పోలీసులు అతి ఉత్సాహం ప్రదర్శిస్తూ రాజకీయ నేతల ప్రసన్నం కోసం న్యాయవాదులపై దాడులు చేయడం, కేసులు పెట్టడం సర్వసాధారణమయిందన్నారు.